# మానవత

## వీరవల్లి రాఘవాచారి

**పక్కపక్కగా కూర్చోవడానికి వీలుగా ఖాళీలులేనిపక్షంలో ఆ బస్‌లో అదివరకే ఎక్కి కూర్చున్న ప్రయాణికులు తాము కూర్చున్న సీట్లలోంచి పైకిలేచి... ఆ భార్యాభర్తలకు విధిగా సీట్లివ్వాలని ప్రత్యేకంగాఏదైనా ఓ రూల్ ఉందా?''**

రాత్రి ఎనిమిది గంటలు.

బాణంలా ముందుకు దూసుకుపోతోంది ఆటో. ఆ ఆటోలో కూర్చున్న రమణమూర్తి రెండు నిమిషాలకోసారి తన రిస్ట్‌వాచీకేసి టైం చూసుకుంటున్నాడు. రమణమూర్తి పక్కనే అతడి భార్య అరుణకూడా కూర్చుని ఉంది. ఆమె ఒడిలో పాప నిద్రపోతూ వుంది.

"బస్ అందుతుందంటారా?" అనుమానంగా భర్తవేపు చూస్తూ అడిగింది అరుణ.

"చెప్పలేను. అయినా చూద్దాం."

"విజయవాడకి మళ్ళీ బస్ ఎన్ని గంటలకుంది?"

"ఈ రాత్రికి యిదే లాస్ట్ బస్. మనం దీన్నిగానీ అందుకోలేకపోతే యిక యింతే సంగతులు" రమణమూర్తి అన్నాడు.

వేగంగా దూసుకువచ్చిన ఆ ఆటో బస్‌స్టాండ్ ముందు ఆగింది. తన సూట్‌కేస్‌ను అందుకుని గబగబా కిందికి దిగి ఆటోవాడికి డబ్బులిచ్చేశాడు రమణమూర్తి. పాపను భుజంమీద వేసుకుని అరుణకూడా ఆటోలోంచి హడావుడిగా కిందికి దిగింది.

"తొందరగా నడు" అంటూ బస్‌స్టాండులోకి వేగంగా నడవసాగాడు రమణమూర్తి.

అరుణ అతడివెంటే నడిచింది. ఆ బస్‌స్టాండ్లో జనం కాస్త పల్చగానే వున్నారు.

"అదిగోనండి బస్ రెడీగా వుంది చూడండి" దూరంగా వున్న బస్‌ను చూపెట్టింది అరుణ.

బస్ కన్పించడం తోటే.. రమణమూర్తికి మనసుకుదుట పడింది. యిద్దరూ బస్ దగ్గరికి నడిచారు.

డోర్ దగ్గరే బయట నిలబడి వున్న కండక్టర్ ఎక్కడికంటూ రమణమూర్తిని అడిగాడు.

"విజయవాడ" చెప్పాడు రమణమూర్తి.

"టికెట్స్ తీసుకువెళ్ళండి" అంటూ రెండు టికెట్స్ చించి రమణమూర్తికి అందించాడు కండక్టర్.

"ఎంత సేపట్లో బయల్దేరుతుంది?"

"టైమైపోయింది. మీరు లోపలికి పదండి."

కండక్టర్ ఆ మాట అనగానే రమణమూర్తి గబగబా బస్‌లోపలికి నడిచాడు. అతడు రెండడుగులు వేసి చటుక్కున నిలబడి బస్సంతా కలయచూశాడు. అది సూపర్ డీలక్స్ బస్. యిద్దరిద్దరు ప్యాసింజర్లు కూర్చునేందుకు వీలుగా లోపల సీట్లు అమర్చబడివున్నాయి.

తను తన భార్య పక్కపక్కగా కూర్చునేందుకు వీలుగా బస్‌లో ఎక్కడా ఖాళీలు కన్పించడంలేదు రమణమూర్తికి. ఓచోట మాత్రం కిటికీ దగ్గర కూర్చున్న యువకుడు విలాసంగా సిగరెట్ కాలుస్తూ బస్‌లో కూర్చున్న ఆడవాళ్ళనందర్నీ అదేపనిగా పరిశీలనగా చూస్తున్నాడు. ఆ యువకుని పక్క సీటు ఖాళీగా వుంది.

ఆ యువకునికి వెనుక సీట్లో కిటికీదగ్గర కూర్చున్న ఓ పల్లెటూరి మనిషి గురకలు పెడుతూ బాగా నిద్రపోతున్నాడు. ఆ పల్లెటూరి మనిషి పక్కన కూడా ఓ సీటు ఖాళీగా వుంది. ఆ యువకుని పక్కసీటు. ఆ పల్లెటూరి మనిషి పక్కసీటు ఈ రెండు సీట్లుమాత్రమే ఆ బస్‌లో ఖాళీగా కన్పిస్తున్నాయి.

ఆ యువకుడిని పైకి లేపి వెనక సీట్లోకి వెళ్ళమంటే.. తనూ అరుణ అక్కడ పక్కపక్కగా కూర్చోవచ్చు. కానీ అతడు వెళతాడో లేదో. ఆ యువకుడిని అడగడానికి రమణమూర్తి కొంతసేపు తటపటాయించి చివరికి అడిగేశాడు.

"ఏమండీ! మీరు దయచేసి ఆ వెనకసీట్లో కూర్చుంటారా. మేమిద్దరం యిక్కడ కూర్చుంటాం" అడిగాడు రమణమూర్తి.

"కూర్చున్న సీట్లోంచి పైకి లేచి వెనక సీట్లోకి నేనెందుకెళ్ళాలి?" సీరియస్‌గా చూశాడా యువకుడు.

"ఆడవాళ్ళున్నారు కదండి."

"ఉంటే నన్నేం చెయ్యమంటారు? నేను ఈ సీట్లో ఫస్ట్ కూర్చున్నాను. పైగా కిటికీ దగ్గర కూర్చోవడం నాకిష్టం. యిక్కడినుండి నేను లేవను. యిది నా సీటు."

"అది మీ సీటేనండి. నేను కాదనడంలేదు. కానీ... చదువుకున్న యువకుడిగా మీరు మా సమస్యను అర్థం చేసుకోండి" చాలా వినయంగా చెప్పాడు రమణమూర్తి.

"ఏమిటండీ మీ సమస్య? బస్‌లో రెండు ఖాళీలు వున్నాయి. కూర్చోండి. లేకపోతే దిగిపోండి. అంతేగానీ నన్ను విసిగించకండి" చాలా ఖచ్చితంగా చెప్పేశాడు యువకుడు.

రమణమూర్తికి ఒళ్ళు మండిపోయింది.

"నేను మిమ్మల్ని విసిగించడం లేదు మిస్టర్! ఎడ్జస్ట్ చేసుకోమంటున్నాను. వీలైతే ఎడ్జస్ట్ చేసుకోండి. కాకపోతే వీలు కాదని చెప్పండి. అంతేగాని దిగిపొమ్మని చెప్పడానికి మీరెవరు? ఏదో చదువుకున్న మనిషిగదా అని భ్రమ పడడం నాదే తప్పు. బాగా సుఖంగా హాయిగా కూర్చున్న ప్రతివాడికి... యిబ్బంది పడేవాడి అభ్యర్థన ఎప్పుడూ విసుగులాగే వుంటుంది లెండి" రమణమూర్తి అన్నాడు.

"అనవసరంగా నోరు పారేసుకోకండి" చాలా తీక్షణంగా చూస్తూ అన్నాడా యువకుడు.

"ఎవరు నోరు పారేసుకుంటున్నారో యిక్కడ బస్‌లో కూర్చున్న వాళ్లందరికీ తెలుసు."

"యూ షటప్"

"ఆ పని తమరు చేస్తే బావుంటుంది."

ఆ యువకుడు పైకి లేచాడు. రమణమూర్తి కూడా వెనుకంజ వెయ్యడం లేదు. యిద్దరి మధ్య మాటలు పెరిగాయి.

"మీరు ఊరుకోండి" అంటూ రమణమూర్తిని చెయ్యి పట్టుకుని వెనక్కు లాగుతోంది అరుణ.

బస్ అంతా గోలగోలగా తయారైంది. బస్‌లోని కొందరు ప్రయాణీకులు కల్పించుకుని యిద్దరికీ నచ్చచెప్పసాగారు.

ఇంతలో కండక్టర్ గబగబా అక్కడికి వచ్చి విషయం తెలుసుకుని, రంగప్రవేశం చేశాడు. ఆ యువకుడికి రమణమూర్తికి సర్దిచెప్పి యిద్దర్నీ విడదీశాడు కండక్టర్.

"నోటి కొచ్చినట్టు వాగితే ఎవరు మాత్రం ఊరుకుంటారు?" గట్టిగా అన్నాడా యువకుడు.

"నోటికొచ్చినట్టు వాగింది నువ్వా నేనా? బోడి ఇంగ్లీషులో నేనూ గుక్కతిప్పుకోకుండా మాట్లాడగలను. అదేం గొప్ప విషయం కాదు" కోపంగా అన్నాడు రమణమూర్తి.

"మీరైనా కాస్త ఊరుకోండి సార్" అంటూ రమణమూర్తి వేపు చూశాడు కండక్టర్.

రమణమూర్తి మౌనం వహించాడు.

"యింత చిన్న విషయానికి యింత గొడవ ఎందుకు

చెప్పండి. సార్! మీరు కొంచెం పైకి లేవండి'' ఆ యువకుడివైపు మూస్తూ అన్నాడు కండక్టర్.

"నేనా? ఎందుకూ?'' సిగరెట్ వెల్గించుకుంటూ కండక్టర్ వైపు మూశాడా యువకుడు.

"మీరు ఈ వెనక సీట్లోకి వచ్చి కూర్చోండి.''

"నేను రాను. యిది నా సీటు. యిక్కడినుండి నేను కదలను'' మొండిగా అన్నాడా యువకుడు.

"మీరంత ఖచ్చితంగా అంటే ఎలాసార్? ఎడ్జెస్ట్ చేసుకునే తత్వం లేకపోతే ఎలా చెప్పండి? మీరు యీ సీట్లోకి వచ్చి కూర్చుంటే... వీళ్లిద్దరూ అక్కడ కూర్చుంటారు.''

"నేను రాను కండక్టర్‌గారూ! నేనిక్కడ కూర్చుంటాను. అసలు నేనెందుకు ఎడ్జెస్ట్ చేసుకోవాలి?''

"ఎందుకంటే ఏం చెప్పేది? మనం మనుషులం. ఎదుటివారి సమస్యను సానుభూతితో అర్థం చేసుకుని ఎడ్జెస్ట్ కావాలండి'' ఆ యువకుడివేపు మూస్తూ అన్నాడు కండక్టర్.

"కండక్టర్‌గారూ! నాకు తెలియక అడుగుతాను ఓ విషయం చెప్పండి'' అన్నాడు ఆ యువకుడు.

"అడగండి''

ఒక బస్‌లోకి భార్యభర్తలు ఎక్కినప్పుడు వాళ్ళిద్దరూ. పక్కపక్కగా కూర్చోవడానికి వీలుగా ఖాళీలు లేని పక్షంలో ఆ బస్‌లో అదివరకే ఎక్కికూర్చున్న ప్రయాణీకులు తాము కూర్చున్న సీట్లలోంచి పైకి లేచి... ఆ భార్యాభర్తలకు విధిగా సీట్లివ్వాలని మీ ఆర్.టి.సి డిపార్ట్‌మెంట్‌లో ప్రత్యేకంగా ఏదైనా ఓ రూల్ ఉందా?''

"అలాంటి రూల్ ఏదీ లేదనుకోండి. కానీ మనం రూల్స్‌కి అనుగుణంగా ఎప్పుడూ జీవించలేం. చట్టాలకు



లోబడి ఖచ్చితంగా జీవించదలచుకుంటే అసలు మనం యిండియా వదిలి వెళ్లిపోవాల్సి వుంటుంది. చట్టాల దగ్గర మనకు కొంత పట్టువిడుపులు అవసరం.''

''ఒకరి విషయం నాకు తెలియదు కండక్టర్ గారూ! కానీ నేను మాత్రం చట్టాలను పాటించి బతికేవాడిని. రూల్స్ అండ్ రెగ్యులేషన్స్‌కి అనుగుణంగా జీవించటం నాకుమొదటినుండి యిష్టం.''

ఆ మాటతో కండక్టర్ విరగబడి నవ్వేశాడు.

''ఎందుకలా నవ్వుతారు?''

''మీ మాటలకూ చేతలకూ మధ్యవున్న కొన్ని యోజనాల దూరాన్ని చూసి....''

''మీరేమంటున్నారో అర్థం కావడంలేదు''.

''చెప్పమంటారా? పొగ్రతాగడం నేరం అని అదిగో బస్‌లో తాటికాయంత అక్షరాల్తో రాసి వుంది. బస్‌లో కూర్చుని యిలా పొగతాగడం చట్టరీత్యా నేరమైనా... మీరు మాత్రం సిగరెట్ కాల్చేస్తున్నారు.''

కండక్టర్ అలా అనగానే ఆ యువకుడి ముఖం సిగ్గుతో కందిపోయింది. వెంటనే తన చేతిలోని సిగరెట్ పీకను **విసిరి దూరంగా పారేసి అదే సీట్లో మళ్ళీ సర్దుకుని కూర్చున్నాడు.**

''అయితే మీరు ఆ సీట్లోంచి లేవరా?'' ఆ యువకుడివైపు చూస్తూ నవ్వుతూ అడిగాడు కండక్టర్.

''ఈ సీట్లో నేను ఫస్ట్ కూర్చున్నాను. కనుక నేను దిగిపోయేవరకు ఈ సీటునాదే. యితరుల యిబ్బందుల్తో నాకనవసరం. నన్ను బలవంతం చెయ్యకండి కండక్టర్‌గారూ. యితరుల యిబ్బందుల్ని గుర్తించి సహాయపడగల విశాల హృదయం నాకు లేదు'' అన్నాడా యువకుడు వ్యంగ్యంగా.

''మీలాంటి యువకులున్న ఈ సువిశాల దేశాన్ని ఎవరూ బాగుపరచలేరనేది యదార్థం'' కండక్టర్ అన్నాడు.

''నాలాంటి యువకులున్న దేశాన్ని మాత్రమే కాదు కండక్టర్‌గారు! భర్త పక్కన కాకుండా పరాయి మగాడి పక్కన కూర్చుంటే ఎక్కడ మైలపడిపోతామో అని భావించే ఆడవాళ్ళు... సినిమా థియేటర్లలోనూ, బస్సుల్లోనూ, రైళ్ళలోనూ భార్యను పక్కనే కూర్చోబెట్టుకోవాలని తహతహలాడే మగవాళ్ళూ వున్న దేశాన్ని కూడా ఎవరూ బాగుపరచలేరనేది వాస్తవం. అందుకే...'' అంటూ ఆ యువకుడేదో చెప్పబోయాడు.

''యూ షటప్'' అంటూ అరిచింది అరుణ.

''పరాయి మగాడిపక్కన కూర్చున్నంత మాత్రాన మైలపడిపోతాననే భావం నాకులేదు. నీ తల్లికో, నీ చెల్లెలికో సంబంధించిన నీ అభిప్రాయాన్ని బహుశా నువ్విలా ఎక్స్‌పోజ్ చేస్తున్నావేమో. నా భుజంమీద యిదిగో మాపాప నిద్రపోతూ వుంది. నేనూ మా ఆయనా పక్కపక్కగా కూర్చుంటే... యిద్దరం మా పాపని ఒడిలోపడుకో**బెట్టుకోవచ్చని అనుకున్నాం. అంతేగాని నువ్వ**నుకున్నంత తక్కువ రకం ఆలోచనలు లేవు.

అరుణ ఆవేశంగా మాట్లాడసాగింది. ఇంతలో కండక్టర్ ఆమెకు సర్దిచెప్పి.. వెనుకసీట్లో నిద్రపోతున్న ఆ పల్లెటూరి మనిషిని నిద్రలేపి... ఆ యువకుని పక్కన ఆ మనిషిని కూర్చోపెట్టాడు. వెనుక సీట్లలో అరుణ రమణమూర్తి కూర్చున్నారు. బస్ కదిలింది.

అది ఎక్స్‌ప్రెస్ గనుక శరవేగంగా దూసుకుపోతోంది. ప్రయాణీకులంతా నిద్రలోకి జారిపోయారు. అలా ఆ బస్ ఎంతసేపు ప్రయాణించిందో అరుణకు తెలియదు. ఎక్కడో బస్ సడెన్‌గా ఆగడంతో అరుణకు చటుక్కున మెలకువ వచ్చింది.

''ఊరులేని చోట అడవిలో బస్ ఎందుకుఆపినట్లు?'' కండక్టర్ని అడిగింది అరుణ.

''ఇతడు లావెట్రీకి వెళ్లాలట'' ఆ యువకునివైపు చేయి చూపెట్టాడు కండక్టర్.

''కండక్టర్‌గారూ! ఇది ఎక్స్‌ప్రెస్. చట్టం ప్రకారం యిది యిలాంటి చోట ఆగకూడదు. రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ అనుసరించి జీవించేవారు పాపం యిందుకు అంగీకరించరు. బస్‌ని ఆపకండి వెళ్లనివ్వండి'' ఆ యువకుని వైపు కసిగా చూస్తూ అన్నాడు రమణమూర్తి.

''వాట్ మిస్టర్! యిప్పుడు ఆయనకేం సమాధానం చెప్పమంటావ్? నువ్ నీ కాంక్షల్యాలకి రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ నేర్పలేదా? చట్టాలు వేరు జీవితాలు వేరు. కొన్ని కొన్ని సమయాల్లో మానవతా దృక్పథమే తప్ప చట్టాల దృక్పథం పనికిరాదు. సరే త్వరగా వెళ్లిరా''. కండక్టర్ అలా అంటూవుంటే... పరాజితుడైన ఆ యువకుడు అవమానంతో తలదించుకుని ఆ బస్‌లోంచి కిందికి దిగాడు!

*



## దురాశ

''నీ కాబోయే భార్యకి ఎలాంటి గుణాలుండాలని అనుకుంటున్నావ్ సత్తీ?'' రాంబాబు అడిగాడు.

''పరాయి మగాడ్ని అన్నా అని ప్రతిఆడదాన్ని చెల్లీ అని అనుకునే సహృద్భావం గల అమ్మాయి పెళ్ళాం కావాలని వుందిరా'' దురాశగా అన్నాడు.

—శ్రీశారద (అమలాపురం)

## హయాం

గుర్నాథం అడిగాడు ఆఫీసర్ని—

''సార్ సార్. మీరిచ్చే జీతం బొత్తిగా సరిపోటం లేదని, వచ్చే నెల నుంచి అయినా పెంచమని అడుగమని మరీ మరీ నా పెళ్ళాం చెప్పి పంపింది సార్...''

''సరే వెళ్ళు. రేపు నా పెళ్ళాన్ని అడిగి చెప్తా ఏ సంగతీ'' విసుక్కుంటూ జవాబిచ్చాడు ఆఫీసర్.

— డి.సత్యమూర్తి (వా॥ దేవుపల్లి)


శ్రీలక్ష్మి, ఆరాధన, సుమంగళి కొత్తగూడెం వారి నిర్వహణలో
రూ. 75,000/- విలువగల 200 బహుమతులను గెలవండి!
ప్రథమ బహుమతి: రూ. 25,000/-
రెండవ బహుమతి: రూ. 10,000/-
ప్రతి రూ. 100/- కొనుగోలుపై ఒక ఉచిత కూపన్
ప్రారంభం: ది. 23-7-87 TO 31-10-87
డ్రా తేది 1-11-87